క్లుప్తంగా

ఘనంగా చర్చి వార్షికోత్సవం



హంసవరంలో ఆరోగ్యమాతను ఊరేగిస్తున్న క్రైస్తవులు

తుని రూరల్: మండలంలోని హంసవరంలో ఆదివారం ఆరోగ్యమాత ఆలయ (చర్చి) వార్షికోత్సవం వైభంగా జరిగింది. పాస్టర్ బాలశౌరి ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆరోగ్యమాత విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, బలిపూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్, హంసవరం, జిల్లేడుపాడు, హెచ్.కొత్తూరు తదితర గ్రామాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి



ఏలేశ్వరంలో రాష్ట్ర సదస్సు కరపత్రాలు పంపిణీ చేస్తున్న వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: బహుజన మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ శ్రేణులు కోరారు. ఈ మేరకు పట్టణంలో ఆదివారం రాష్ట్ర సదస్సు కర పత్రాలు పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్, పార్టీ నాయకులు గుమ్మడి పాదాలమ్మ, పిల్లా కాంతం, పందిరి ధర్మరాజు, గుమ్మడి రాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత



విజయవాడ వరద బాధితులకు బ్రెడ్లు, వాటర్ బ్యాటిల్స్ పంపిస్తున్న హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ అధికారులు

గోకవరం: విజయవాడలోని వరద బాధితులకు మండలంలోని వీరలంకపల్లి గ్రామ శివారున ఉన్న హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ చేయూతనిచ్చింది. వరద బాధితుల సహాయార్థం ప్లాంట్ మేనేజర్ కరణ్ జీవన్, ఇన్‌చార్జి మేనేజర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో వెయ్యి బ్రెడ్లు, 1000 వాటర్ బ్యాటిల్స్‌ను శనివారం విజయవాడ పంపించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి పవన్ కుమార్, కాంట్రాక్టర్ ఆకుల సుబ్రహ్మణ్యం, సిబ్బంది రత్నం, వీరబాబు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కోటనందూరులో అవగాహన ర్యాలీ చేస్తున్న మహిళలు

కోటనందూరు: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఉజ్వల స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత పి.నాగరాజు సూచించారు. కోటనందూరులో ఆదివారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. చెట్లను నరకకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తక్కువ మైక్రాన్ల కలిగిన ప్లాస్టిక్ సంచులను వాడవద్దన్నారు. జ్యూట్ సంచులను మాత్రమే వాడాలని సూచించారు. ఉజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిలో భారత్‌కు ప్రథమస్థానం

గండేపల్లి: ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ ప్రథమ స్థానంలో ఉందని ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎస్.సతీష్ రెడ్డి అన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గణాంకాల ప్రకారం ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిలో మనదేశం నంబర్ వన్ స్థానంలో ఉండటం బాధాకరమన్నారు. విద్యావంతులైన యువత పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించే దిశగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్.శృతిరెడ్డి, డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, శేషారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మురారిలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీపీ, భక్తులు



గోకవరంలో భారీ గణపతిని దర్శించుకుంటున్న భక్తులు



ఏలేశ్వరంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కొత్త సూరవరంలో స్వామివారిని దర్శించుకుంటున్న యనమల కృష్ణుడు, చక్రరావు, తదితరులు

జై జై గణేశా..

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు
- స్వామివారికి ప్రత్యేక పూజలు



శంఖవరంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీపీ పర్వత రాజుబాబు, భక్తులు

ఏలేశ్వరం: విఘ్నాధిపతి వినాయక చవితి వేడుకలు శనివారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వైభవంగా జరిగాయి. వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసి చవితి వేడుకలు నిర్వహించారు. భక్తులు పాళిలను రకరకాల పండ్లు, పువ్వులు, పత్రిలతో అలంకరించి వినాయకుని ప్రతిమల వద్ద కట్టారు. స్వామివారికి ప్రసాదాలు, కుడుములు, ఉండ్రాళ్లతో ప్రత్యేక పూజలు చేశారు. ఏలేశ్వరంలోని పాత బస్టాండ్, అడ్డతీగల రోడ్డు, నర్సీపట్నం రోడ్డు, కాలేజీ రోడ్డు, లింగంపర్తి రోడ్డు, తోటవీధి, పెద్ద వీధి, పల్లపు వీధి, పలు కాలనీల్లో వినాయకుని విగ్రహాలను నెలకొల్పారు.

గండేపల్లి: మండల వ్యాప్తంగా శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో వాడవాడలా వినాయక ప్రతిమలను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మురారిలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, గండేపల్లిలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు మద్దిపట్ల రామకృష్ణ స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పెద్దిపాలెంలో స్వామివారికి సమర్పించేందుకు 101 కేజీల లడ్డూను తీసుకువెళుతున్న భక్తులు

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన భారీ విగ్రహాలు

గోకవరం: మండల ప్రజలు వినాయకచవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ప్రధాన రహదారి చెంత వేంచేసిన విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద భారీ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వెనుక వీధిలో సుమారు 18 వేల రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ గణపతి ఉత్సవ కమిటీకి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ రూ.80 వేలు అందజేశారు. స్థానిక గుబ్బాలమ్మ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.1.40 లక్షలతో హైదరాబాద్ నుంచి 15 అడుగుల భారీ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తంటికొండ వెళ్లే మార్గంలో సీఎండీ కేఎస్‌పీవీ లేఅవుట్ ప్రాంగణంలో గణపతి ఉత్సవాలను నిర్వహించారు.

కిర్లంపూడి: మండలంలో గణపతి నవరాత్ర ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, డీజే, తీన్మార్ డాన్సులు, బాణసంచా కాల్పుల నడుమ వినాయక ప్రతిమలను ఊరేగించి మండపాల్లో ప్రతిష్ఠించారు. గృహాల్లో, దుకాణాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి స్థానిక చెరువులు, ఏలేరు కాలువల్లో నిమజ్జనం చేశారు.

తొండంగి: మండలంలోని తొండంగి, వేమవరం, పెరుమాళ్లపురం, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం తదితర గ్రామాల్లో గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.విద్య, ఉద్యోగ, వ్యాపారాల రీత్యా దూర ప్రాంతాలకు వెళ్లిన వారంతా స్వ గ్రామాలకు చేరుకుని చవితి వేడుకల్లో సందడి చేశారు. కుండపోత వర్షాల నేపథ్యంలో పలు గ్రామాల్లో పలుపు ప్రాంతాలు జలమయం కావడంతో కొన్ని చోట్ల గణేశ్ ఉత్సవాలు నిర్వహించలేదు.

శంఖవరం: మండల వ్యాప్తంగా శనివారం చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో స్వామివారిని ఎంపీపీ పర్వత రాజుబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తుని రూరల్: మండలంలో గణపతి నవరాత్ర మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎస్.అన్నవరం, కొత్త సూరవరం, హంసవరం, తేటగుంట, వి.కొత్తూరు, డి.పోలవరం, రాపాక, కేఓ.మల్లవరం, ఎన్.చామవరం, కొలిమేరు, రేఖవానిపాలెం, కుమ్మరిలోవ తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీలు గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. తేటగుంటలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. కొత్త సూరవరంలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు యనమల కృష్ణుడు, గంటా చక్రరావు పాల్గొని పూజలు నిర్వహించారు. తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, వేద విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు.

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి

తుని: వినాయక చవితి వేడుకలు శనివారం తుని నియోజకవర్గంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సీతారాంపురంలో న్యూ పార్కు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహం అందరినీ అకట్టుకుంది. సూరవరం రోడ్డులోని కొత్తపేట శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బ్యాంకుకాలనీ, అమ్మాజీపేట, ఈగలవారి వీధి, పాత బజారు వీధి, సాయినగర్, మార్కండ్రాజుపేట తదితర ప్రాంతాల్లో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన భారీ వర్షాలకు తుని పట్టణం తడిసి ముద్దయ్యింది. తాండవ నది ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు తాండవ రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు చేరింది. ఆ నీటిని క్రస్ట్ గేట్లు ద్వారా దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



తుని పట్టణం సీతారాంపురంలో ఆకట్టుకుంటున్న మట్టి గణపతి విగ్రహం

ప్రత్తిపాడు రూరల్: మండలవ్యాప్తంగా శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, ఉత్తరకంచి, పెద్దిపాలెం, శరభవరం, పోతులూరు, యూజే పురం తదితర గ్రామాల్లో భక్తులు పోటీ పడి భారీ గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. వినాయక చవితి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి భారీ లడ్డూలను భక్తులు సమర్పించారు. మండలంలోని పెద్దిపాలెంలో నూకాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకునికి 101 కేజీల లడ్డూను భక్తులు సమర్పించారు.

రత్నగిరిపై వైభవంగా వేడుకలు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.30 గంటలకు సత్యదేవుని దర్బారు మండపంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు, ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉండ్రాళ్లు, పిండి వంటలు నివేదించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. యంత్రాలయంలో, సత్యదేవుని ఆగమ పాఠశాలలో గణపతులను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అన్నవరంలో 50 చోట్ల గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



రత్నగిరిపై గణపతికి పూజలు చేస్తున్న పండితులు

ప్రమాదకరంగా ఏలేరు వంతెన

ఏలేశ్వరం: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలేరు కాలువపై నిర్మించిన వంతెన (కాజ్‌వే) ప్రమాదకరంగా మారింది. ఏలేశ్వరం నుంచి జగ్గంపేట మండలంలోని పలు గ్రామాలకు రాకపోకల నిమిత్తం స్థానిక బ్రాహ్మణ రేవు నుంచి కాలువ మీదుగా వంతెన నిర్మించారు. సుమారు మూడేళ్ల క్రితం వంతెన కింద స్తంభాలు ఒరిగిపోవడంతో వంతెన దెబ్బతింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం దీనిపై ద్విచక్ర వాహనాలు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు శనివారం వంతెనకు అవతలి వైపు మట్టి కొట్టుకుపోవడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్రవాహనాల రాకపోకలకూ ఆటంకం కలిగింది. అధికారులు వెంటనే స్పందించి గోతులు పూడ్చి రాకపోకలు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వంతెన స్థానంలో కొత్త వంతెనను నిర్మించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.





వంతెనను పరిశీలిస్తున్న ఆర్డీఓ సీతారామారావు (అంతరచిత్రం) వంతెనను ఆనుకుని ఏర్పడిన గొయ్యి

ఆర్డీఓ, డీఎస్పీ పరిశీలన

ఏలేరు వంతెనను పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు, డీఎస్పీ లతాకుమారి ఆదివారం పరిశీలించారు. గోతుల పడిన ప్రదేశాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో వంతెన దెబ్బతినే ప్రమాదం ఉందని, దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తొండంగి: భారీ వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు డిమాండ్ చేశారు. మండలంలోని కోదాడ, ఎ.కొత్తపల్లి ఆవలో ముంపు బారిన పడిన వరి పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు రావడంతో కోదాడ, ఎ.కొతపల్లి గ్రామాల్లో వేలాది ఎకరాలు నీట మునిగాయన్నారు. రోజుల తరబడి ముంపులోనే ఉండటంతో పంటలు కుళ్లిపోతున్నాయన్నారు. వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కోదాడలో వరి పొలాలను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు

ఏపీ స్టేట్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా సత్తిబాబు

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటకు చెందిన నక్కా సత్తిబాబు ఏపీ స్టేట్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా నియమితులైనట్టు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన 1983 నుంచి కాంగ్రెస్‌లో ఉన్నారు. కార్యకర్త నుంచి జిల్లాస్థాయి వరకూ పలు పదవులు పొందారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తోట నరసింహం

కిర్లంపూడి: భారీ వర్షాల నేపథ్యంలో ఏటిపట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సూచించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏలేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో అధికంగా ఉండటంతో సుమారు 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. నీరు విడుదల చేస్తే కిర్లంపూడి మండలంలోని లోతట్టు గ్రామాలు నీట మునిగే ప్రమాదం ఉందన్నారు. ఈ మేరకు ఏలేరు కాలువను ఆనుకొని లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షత ప్రదేశాలకు తరలించి, వారికి అన్ని వసతులు కల్పించాలని ఉన్నతాధికారులను కోరినట్టు తెలిపారు.

అన్నదాతకు మరో వాయుగండం

- ఎడతెరిపి లేకుండా భారీ వర్షం
- ఇంకా ముంపులోనే వరిపొలాలు
- ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహం

తొండంగి: ఆరుగాలం కష్టించి ఖరీఫ్ సాగు చేస్తున్న అన్నదాతలను బంగాళాఖాతంలో ఏర్పడుతున్న వరుస అల్పపీడనాలు, వాయుగుండాలు ముంచేస్తున్నాయి. వారంరోజుల క్రితం ఏర్పడిన వాయుగుండం ముప్పు తొలగిపోకుండానే మరో మారు అల్పపీడనం ఏర్పడి వాయుగుండంగా మారింది. దీని ప్రభావంతో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన వారం రోజులుగా అధిక వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి పీబీసీ, పంపా ఆయకట్టుకు వరద పోటెత్తుతోంది.

నీట మునిగిన పంట పొలాలు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తొండంగి మండలంలోని కొమ్మనాపల్లి, కోదాడ, సీతారాంపురం, ఏవీ నగరం, రావికంపాడు, వేమవరం, కృష్ణాపురం, పి.అగ్రహారం తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట పూర్తిగా ముంపుబారిన పడింది. వాయుగుండం తీరం దాటాక కేవలం రెండు రోజులు మాత్రమే వాతావరణం తెరిపిచ్చింది. గత రెండు రోజులుగా కుండపోత వర్షాలు కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరిపొలాలు ముంపు నుంచి తేరుకోకుండానే మళ్లీ కుండపోత వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పోటెత్తి పంట కుళ్లిపోతుండటంతో బాధిత రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వాయుగుండం తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ హెచ్చరించడంతో రైతులు, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అల్లకల్లోలంగా సముద్రం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. సుమారు రెండు మీటర్లు ఎత్తు వరకూ అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రంలో ప్రతికూల వాతావరణంతో మత్స్యకారులు తమ బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. ఇప్పటికే పదిహేను రోజులుగా సముద్రంలో ప్రతికూల పరిస్థితుల కారణంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లలేదు. అనుకూల వాతావరణం ఏర్పడే వరకూ మత్స్యకారులు వేటకు వెళ్లరాదని మత్స్యశాఖ అధికారి ఉమామహేశ్వరరావు సూచించారు.

విస్తారంగా వర్షాలు

శంఖవరం: మండలంలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం, సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో వరి చేలు నీట మునిగాయి. పత్తి, కూరగాయలు సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శంఖవరం, కత్తిపూడి, కొతంగి గ్రామాల్లో చెరువులు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. సిద్దవారి చెరువు నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లడంతో పొలాలు నీట మునిగాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



తుని వద్ద మినీ రిజర్వాయర్ కట్టడాల పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

ఏకధాటిగా వర్షం


తుని రూరల్: మండలవ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. పత్తి, వరి పంటలు నీట మునిగాయి. వరద ప్రభావిత గ్రామాలైన హెచ్.కొత్తూరు, హంసవరం, జిల్లేడుపాడు, టి.తిమ్మాపురంలో పెద్దాపురం డీఎల్‌పీఓ బాలామిణి పర్యటించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రస్తుతం వరద పరిస్థితి ప్రమాదకరంగా లేదన్నారు. పంపా రిజర్వాయర్ నుంచి అదనపు జలాలు విడుదల చేస్తే జిల్లేడుపాడు, హెచ్.కొత్తూరు గ్రామాల్లోకి వరదనీరు ప్రవేశించే అవకాశం ఉందన్నారు. ఆదివారం సాయంత్రానికి పంపాలో 98.88 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. తాండవ రిజర్వాయర్‌లో 378.25 అడుగులు నీటి నిల్వలు ఉన్నాయని, ప్రాజెక్టు భద్రతా చర్యల్లో భాగంగా నదిలోకి 1200 క్యూసెక్కులు నీరు విడుదల చేసినట్టు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలకు ఎటువంటి ఆస్తి నష్టం సంభవించలేదన్నారు. అన్ని గ్రామాల్లో వీఆర్వోలను అప్రమత్తం చేశామన్నారు. తాండవ జలాశయం నుంచి రెండు క్రస్ట్ గేట్లు ఎత్తి 1200 క్యూసెక్కులు నీరు విడుదల చేయడంతో తుని కత్రాళ్ల కొండవద్ద, శ్మశానవాటిక వద్ద ఉన్న రెండు మినీ రిజర్వాయర్ల కట్టడాల పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. పరివాహక ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న వరదనీటితో రాత్రికి మరింత ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు


ప్రత్తిపాడు రూరల్: మండలంలోని లోతట్టు గ్రామాలైన లంపకలోవ, పెదశంకర్లపూడి తదితర గ్రామాలను ఆదివారం తహసీల్దార్ ఎం.సూర్యప్రభ సందర్శించారు. ఏలేరు ప్రాజెక్టు, సుబ్బారెడ్డి సాగర్‌లో వరద నీటి కారణంగా ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.

ఏటిగట్టును పరిశీలించిన అధికారులు

జగ్గంపేట: మండలంలో ఏలేరు కాలవగుట్టను ఆనుకుని ఉన్న ఇర్రిపాక, మామిడాడ గ్రామాల్లో ఆదివారం రాత్రి అధికారులు పర్యటించారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి వరద నీటిని దిగువకు వదులుతున్న నేపథ్యంలో ఇర్రిపాక, మామిడాడ గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తంగా చేశారు. ఇర్రిపాకలో ఏటిగట్టును ఆనుకుని ఉన్న దేవాలయాలు దెబ్బతినకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ రమేష్ తెలిపారు. ఈ ప్రాంతాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కూడా పరిశీలించారు.



ఇర్రిపాకలో ఏలేరు కాలువ గట్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అధికారులు



తొండంగి మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పీబీసీ కాలువ

ఎడతెరిపి లేకుండా వర్షం



ఏలేశ్వరంలో నీట మునిగిన పాఠశాల ప్రాంగణం

ఏలేశ్వరం: అల్పపీడన ప్రభావంతో ఆదివారం తెలవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు, పంటపొలాలు నీటమునిగాయి. మరోరెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు జనం ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. మండలంలోని యర్రవరం, తిరుమాలి, సిరిపురం తదితర గ్రామాల్లో పంట పొలాలు నీటమునగడంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు.